


వాడపల్లి ఆలయ ఉప కమిషనర్‌గా చక్రధరరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న చక్రధరరావు

ఆత్రేయపురం, సెప్టెంబరు 23: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఉప కమిషనరుగా నల్లం చక్రధరరావును నియమిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనరు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కృష్ణా జిల్లా మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఈవో, డీసీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న భూపతిరాజు కిశోర్‌కుమార్ పెనుగంచిప్రోలు శ్రీలక్ష్మి తిరుపతమ్మ ఆలయ ఉప కమిషనరుగా బదిలీపై వెళ్లారు. సోమవారం చక్రధరరావు బాధ్యతలు స్వీకరించి స్వామివారిని దర్శించుకున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేస్తానని ఆయన చెప్పారు.

కలలు.. కల్లలయ్యాయి!

మెడికోలను చిదిమేసిన జలఖడ్గం

7

కలలు కల్లలయ్యాయి.. ఆశలు ఆవిరయ్యాయి.. చిన్నపాటి నిర్లక్ష్యం.. భవిష్యత్‌లో ఎంతో మందికి ఊపిరిపోయాల్సిన వారి ఊపిరినే తీసేసింది.. కుటుంబీకులకు తీరని శోకం మిగిల్చింది.. నిన్నటి వరకూ మా అమ్మాయి డాక్టర్ చదువుతుందంటూ ఎంతో గర్వంగా చెప్పుకున్న ఆ తల్లిదండ్రుల నోటమాట రావడంలేదు.. కళ్ల నుంచి ఉబికి వచ్చే కన్నీళ్లు ఆగడంలేదు.. తమ కళ్లెదుటే కొట్టుకుపోయారని.. ఎక్కడో ఒక చోట నుంచి తిరిగి వస్తారని ఆశగా ఎదురుచూసిన స్నేహితులకు కన్నీరే మిగిలింది.. తాము చూస్తుండగానే ఆనందంగా వాగులో దిగి గల్లంతైన ముగ్గురిలో ఇద్దరు విగతజీవులుగా కనిపించడాన్ని తట్టుకోలేకపోతున్నారు.. వెళ్లిపోదాం లేవండిరా అంటూ స్నేహితుల మృతదేహాలను పట్టుకుని వాళ్ల వెంట వచ్చిన స్నేహితులంతా కన్నీటిపర్యంతమయ్యారు. మారేడుమిల్లి జలతరంగిణి వాగు వద్ద క్షణాల్లో పెరిగిన నీటి ఉధృతికి ముగ్గురు ఆశ్రం మెడికల్ కాలేజీ విద్యార్థులు గల్లంతైన ఘటన విదితమే. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు లభ్యం కావడంతో ఆ ప్రాంతమంతా హృదయవిదారకంగా మారింది.. తోటి స్నేహితులు.. విద్యార్థినుల బంధువులను ఆపడం ఎవరి వల్లా కాలేదు.. మరొకరి ఆచూకీ ఇంకా లభించాల్సి ఉంది.



గల్లంతైన వారి ఆచూకీ కోసం సోమవారం వాగులో వెతుకుతున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది







గ్రీవెన్స్‌లో వచ్చే ప్రతి అర్జీకి

పరిష్కారం చూపాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆత్రేయపురం, సెప్టెంబరు 23: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకి సత్వరం పరిష్కారం చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొని ప్రతి అర్జీని స్వీకరించారు. సుమారు 99 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి లాగిన్ ద్వారా ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిష్కరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి సమస్యను పరిష్కరించి తనకు నివేదించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్పంచ్‌లు కాయల జగన్నాథం, మెర్ల రాము తమ గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు జరగడం లేదని సత్వరమే క్రయవిక్రయాలు చేసుకొనేలా వెసులుబాటు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. సర్పంచ్‌లు గెద్దం సుధ, జుజ్జవరపు శ్యామల, నరాలశెట్టి సుబ్బలక్ష్మి, జాన మంగతాయారు కలెక్టర్‌ను కలిసి తమ గ్రామాల్లో అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఒకానొక దశలో కలెక్టర్ లొల్లకు చెందిన దివ్యాంగురాలు వద్దకు వెళ్లి అర్జీని స్వీకరించారు. ఆత్రేయపురానికి చెందిన గాదిరాజు ప్రసాద్‌రాజు గ్రామంలో వివిధ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఇలా వివిధ అంశాలపై కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో అర్జీలు వెల్లువెత్తాయి. అర్జీల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దారు రాజేశ్వరరావు, డివిజన్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో కమిషనర్ భేటీ

అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా కేవీఆర్ఆర్ రాజు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 23: అమలాపురం పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా కేవీఆర్ఆర్ రాజు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పాలకవర్గ సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం కమిషనర్ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. అనంతరం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.



అన్నవరంలో.. అవినీతి!

దేవస్థానంలో నెయ్యికి 'నోట్ల' తడి



- నెయ్యి నాణ్యతపై అనుమతులు నిల్
- జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ తనిఖీల్లేవ్
- నేటికీ అనామక కంపెనీ నుంచే నెయ్యి
- కాంట్రాక్టర్‌కు అడ్డగోలు సహకారం
- తిరుపతి ఘటనతో మేల్కొన్న ప్రభుత్వం
- నెయ్యి సరఫరాలో సమూల మార్పులు
- ప్రస్తుత కంపెనీని తప్పించాలని నిర్ణయం
- వచ్చే నెల నుంచి కొత్త కాంట్రాక్టర్ రాక
- ఇకపై విజయ డెయిరీ నెయ్యి కొనుగోలు?
- సింహాచలానికి విశాఖ డెయిరీ నెయ్యి
- డిప్యూటీ సీఎం పవన్‌తో చర్చలు
- అన్నవరం నెయ్యి శాంపిళ్లు బెంగళూరుకు
- మరో 20 రోజుల్లో రానున్న నివేదిక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానంలో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఆలయ అధికారుల ఉదాసీనత అనేక అనుమానాలకు తావిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అడ్డగోలు కంపెనీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు కట్టబెట్టిన ఆలయ అధికారులు అసలు నాణ్యతను పట్టించుకోలేదు. అంతేకాదు.. నెయ్యి నాణ్యతపై జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అనుమతులు లేవు. తాజాగా తిరుపతి లడ్డూలో వినియోగించి నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని తేలిన నేపథ్యంలో అన్నవరంలో నెయ్యి నాణ్యతపై ఆరా తీస్తే అనేక చేదు నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నవరం నెయ్యిని సైతం ప్రక్షాళనచేయాలని నిర్ణయించింది. కమీషన్లకు కక్కుర్తి పడి అనామక కంపెనీకి కట్టబెట్టిన నెయ్యి కాంట్రాక్టును పూర్తిగా తొలగించాలని భావిస్తోంది. ఇక ప్రభుత్వ డెయిరీ నుంచే నేరుగా నెయ్యి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో విజయ డెయిరీని రంగంలోకి దించబోతున్నారు. ప్రస్తుత నెయ్యి నాణ్యత నిగ్గుతేల్చడానికి శాంపిళ్లను బెంగళూరు ల్యాబ్‌కు తరలించారు.

నెయ్యి పేరుతో నోట్లు మింగుడు...

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అన్నవరం దేవస్థానం ఎంతో ప్రఖ్యాతి చెందింది. ఏటా లక్షల్లో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వస్తారు. ఒక్క ప్రసాదమే ఏటా రెండు కోట్ల ప్యాకెట్లు అమ్ముడవుతాయి. ఇక్కడి ప్రసాదం అంటే భక్తులకు అంత ప్రీతి. అందుకే దేవస్థానంలో ప్రసాదం తయారీకి ఏటా 18 లక్షల కిలోల నెయ్యి అవసరం ఉంటుంది. కానీ అధికారులు ఈ నెయ్యిలో కోట్లలో నోట్ల వేట సాగించారు. ఆరు నెలలకోసారి ఒక్కొక్క కాంట్రాక్టర్ నుంచి నెయ్యి సరఫరా జరగాల్సి ఉంటే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఓ అనామక కంపెనీ నుంచి ఏకంగా రెండేళ్ల పాటు అధికారులు నెయ్యి కొనుగోలు చేశారు.అసలు ఆ కంపెనీకి అంత నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం లేకపోయినా కాంట్రాక్టు కట్టబెట్టేశారు. ఇదే కాంట్రాక్టరు పక్కనే సింహాచలం దేవస్థానానికి కిలో నెయ్యి రూ.344కి సరఫరా చేస్తే అన్నవరం దేవస్థానానికి ఏకంగా రూ.538కి విక్రయించారు. ఈ రెండేళ్లలో సదరు కాంట్రాక్టర్‌కు సింహాచలంతో పోల్చితే ఏకంగా రూ.7.80 కోట్ల వరకు గిట్టేశాడు. అంతేకాదు తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యిని నిబంధనల ప్రకారం ఆలయ అధికారులు జిల్లా ఆహార కల్తీ నియంత్రణ శాఖ ద్వారా తనిఖీ చేయించాలి. నెయ్యి వచ్చిన వెంటనే ఆ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అధికారులు వచ్చి నెయ్యి నాణ్యత పక్కాగా ఉందని ధ్రువీకరించిన తర్వాతే వినియోగించాలి.కానీ దేవస్థానం అధికారులు అసలు ఈ పని చేయలేదు.ఆ శాఖతో సంప్రదింపులు చేయ లేదు. నెయ్యి సరఫరా అయిన ప్రతిసారీ తనిఖీ చేయిస్తే ఎక్కడ నాణ్యత బయటపడి తమ బండారం బట్టబయలు అవుతుందోనన్న భయంతో అడ్డగోలుగా వ్యవహరించారు. పూర్తిగా నిబంధనలకు తూట్లు పొడిచారు. అనామక నెయ్యి సరఫరా కాంట్రాక్టరు తనకు అనుకూలంగా తెచ్చుకున్న దొంగ నాణ్యత సర్టిఫికెట్‌నే నమ్మి నెయ్యి కొనుగోలు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలే ఆరు నెలలకోసారి మారాల్సిన కాంట్రాక్టర్ మారకపోవడం, ఇతర ఆలయాలతో పోల్చితే అధిక చెల్లింపులు, పైగా నెయ్యికి తనిఖీలు చేయించకపోవడం వెనుక ఎన్ని కోట్ల లో కమీషన్లు చేతులు మారాయనేదానిని రుజువు చేస్తోంది.

ఇకపై సమూల మార్పులు..

తిరుపతి లడ్డు తయారీలో గత వైసీపీ ప్రభుత్వం జంతు కొవ్వులు కలిసిన నెయ్యిని వినియోగించిన ఘటన బట్టబయలు కావడంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. అన్నవరం దేవస్థానంలోను ఇకపై నెయ్యి నాణ్యత పెంచాలని నిర్ణయించింది. వైసీపీ హయాం నుంచి అడ్డగోలుగా కొనసాగుతున్న ప్రస్తుతం రైతు డెయిరీ కాంట్రాక్టర్‌కు నెయ్యి సరఫరా గడువు ఈనెలతో ముగుస్తోంది. తిరిగి వచ్చే నెల నుంచి మరో కొత్త కాంట్రాక్టర్ రంగంలోకి దిగుతున్నారు. ఈలోపే నెయ్యి నాణ్యతపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతోంది. అందులో భాగంగా ప్రభుత్వ విజయ డెయిరీ నుంచి మొత్తం నెయ్యిని కొనుగోలు చేయాలని దాదాపు నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు జిల్లా మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి విజయ నుంచి నెయ్యి కొనుగోలు ప్రతిపాదన తీసుకువెళ్లారు. అదే సమయంలో సింహాచలం దేవస్థానానికి అన్నవరం ఆలయానికి సరఫరా చేస్తున్న కాంట్రాక్టరే నెయ్యి సరఫరా చేస్తుండడంతో ఆయన్ను తప్పించి విశాఖ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని సోమవారం నిర్ణయం తీసుకున్నారు.ఈ నేపథ్యంలో పవన్ దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకువెళ్లబోతున్నారు. తద్వారా విజయ, విశాఖలో ఏదనేది నిర్ణయించనున్నారు. విజయ డెయిరీ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయి. అన్నవరం దేవస్థానంలో జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులు ఆదివారం తనిఖీలు చేసి నాలుగు నెయ్యి శాంపిళ్లు సేకరించారు. నాణ్యతను నిగ్గు తేల్చడానికి హైదరాబాద్‌లోని స్టేట్ ల్యాబ్, మరింత లోతైన విశ్లేషణకు బెంగళూరులోని కేంద్ర ల్యాబ్‌కు పంపించారు. 20 రోజుల్లో వీటికి సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు రానున్నాయి.

కాకినాడ కలెక్టర్ ఆగ్రహం..

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ నెయ్యి నాణ్యత విషయమై ఆగ్రహంగా ఉన్నారు. ఇప్పటికే జిల్లా ఆహారకల్తీ నియంత్రణశాఖ అధికారులను పిలిపించి మాట్లాడగా అసలు నెయ్యి నాణ్యతపై ఏ రోజూ తమ ద్వారా తనిఖీలు జరగలేదనే విస్తుగొలిపే వాస్తవాలు బయటకు వచ్చాయి. తమకు దేవస్థానం నుంచి అసలు ఎప్పుడూ సమాచారం లేదని కలెక్టర్‌కు వివరించారు. ఒకరకంగా ఇది పూర్తిగా నిబంధనల ఉల్లంఘనే అని తేల్చిచెప్పారు. తిరుపతి ఘటన నేపథ్యంలో ఇకపై ఆలయానికి వచ్చే నెయ్యిని ఆహార కల్తీ నియంత్రణశాఖ అనుమతించి పక్కాగా ఉందని నిర్ధారించిన తర్వాతే వినియోగించేలా జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ ఆలయ ఈవోకు రాతపూర్వకంగా లేఖ రాయబోతోంది.

రెవెన్యూ శాఖలో బదిలీలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లా పరిధిలో రెవెన్యూ శాఖలో బదిలీలు జరిగాయి. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులను వెలువరించారు. 28 మంది డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ అయ్యారు. అలాగే 19 మంది సీనియర్ అసిస్టెంట్లు, 8 మంది జూనియర్ అసిస్టెంట్లు, 57 మంది వీఆర్వోలను బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు నాగబాబు, చిరంజీవిబాబు, భద్రరావు, సతీష్‌కుమార్ రెడ్డి,రాజును కాకినాడ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే సుధాకర్‌రావు, సత్యనారాయణ, చైతన్యబాబు, సుబ్బారావును తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేశారు. వెంకటేశ్వరరావును కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. కాకినాడ జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న దుర్గాప్రసాద్, పద్మావతి, పవన్‌కుమార్, రామచంద్రారెడ్డి, కార్తీక్, అఖిల్, ఆనంద్, లక్ష్మీప్రసన్నను అల్లూరిసీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు బదిలీ చేశారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ నోడల్ అధికారిగా వ్యవహరించి ఈ బదిలీలను చేశారు. అలాగే జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు భారీగా బదిలీలు జరిగాయి. గ్రేడ్ 1 కార్యదర్శులు 52 మంది, గ్రేడ్ 2 కార్యదర్శులు 49 మంది, గ్రేడ్ కార్యదర్శులు 7 మంది, గ్రేడ్ 4 కార్యదర్శులు 33 మంది బదిలీ అయ్యారు.

శానిటేషన్, పంచాయతీ సిబ్బందికి

వైద్య పరీక్షలు: డీపీవో రాంబాబు

పి.గన్నవరం, సెప్టెంబరు 23: సఫాయి సురక్ష కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 2400 మంది శానిటేషన్ సిబ్బంది, పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించామని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వైద్య పరీక్షలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సిబ్బందికి మండల స్థాయిలో వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. త్వరలోనే శానిటేషన్ సిబ్బందితో పాటు పంచాయతీ సిబ్బందికి యూనిఫామ్, షూలు, వృత్తి రీత్యా అవసరమయ్యే కిట్లు, హెల్మెట్లు అందిస్తామన్నారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో ఈ-శ్రమ్ ద్వారా ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తున్నామని వైద్య శిబిరాల్లోనే నమోదు కూడా జరుగుతుందన్నారు.జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, కార్యదర్శులు ఉన్నారు.



'విషాద' కేంద్రాలు!

- మన్యం పర్యాటకంలో తరచూ ప్రమాదాలు
- వాగులు, జలపాతాల్లో దిగి మృత్యువు ఒడిలోకి
- ఆనందంతో వచ్చి.. కన్నీటితో వీడ్కోలు
- పర్యాటకుల భద్రత సైతం గాలికి
- ప్రమాదకర ప్రాంతాల్లో వీక్షణకే పరిమితం చేస్తే కొంత మెరుగు

(రంపచోడవరం)

మన్యంలో అడ్డతీగల మండలం పింజరికొండ, రంపచోడవరం మండలం సీతపల్లి వాగు, భూపతిపాలెం ప్రాజెక్టు, మారేడుమిల్లి మండలం పాములేరు వాగు, ఇపుడు కొత్తగా జలతరంగిణి జలపాతం, అటుపైన ఘాటీలో మరొక జలపాతం ఉండగా చింతూరు మండలం మోతుగూడెం జలపాతం, సోకులేరు వాగు వీటి అన్నిటికీ మించి గుడిసె హిల్ స్పాట్... ఇలా అనేక ప్రకృతి ఇచ్చిన పర్యాటక కేంద్రాలు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా అటవీశాఖ నిర్వహిస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టులను కేవలం ఆదాయ వనరులుగానే మార్చుకుంటు న్నారు తప్ప, అక్కడికి వచ్చే పర్యాటకుల రక్షణను మాత్రం గాలికొదిలేశారు. ఇదే పర్యాటకులకు ప్రాణగండంగా మారింది. ఎందరో యువతీ, యువకులు వాగుల్లో పడి మృతి చెందారు. అయినాగానీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని భారీవర్షాలు, ప్రకృతి విపత్తులరీత్యా ఐటీడీఏ, రెవెన్యూశాఖ కొంతకాలంపాటు నిషేధం విధించాయి. కానీ పర్యాటకులు ఈ నిషేధాన్ని ఉల్లంఘించి మరీ మన్యంలోకి వస్తున్నారు. దీనికితోడు ఆయా కేంద్రాల వద్ద కూడా పోలీసు పహారా లోపించడంతో పర్యాటకులను అడ్డుకునే వారే లేకుండా పోయారు. మరోవైపు అటవీ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఎకో టూరిజం పర్యాటక కేంద్రాలను మాత్రం ఆ శాఖ కొనసాగిస్తూనే ఉంది. దీంతో అటవీశాఖ నిర్వహించే పర్యాటక కేంద్రాల్లో నిషేధం అమలులో లేనట్టే. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతానికి పర్యాటకులను అనుమతిస్తూ టికెట్లను విక్రయించడమే ఆదివారం నాటి ఘటనకు కారణమైంది. ఎక్కడి నుంచో వచ్చిన మెడికల్ విద్యార్థులను నిరోధించాల్సిన అటవీశాఖ అధికారులు, టికెట్ల ఆదాయం కోసం వారిని జలతరంగిణిలోకి అనుమతించడమే ప్రమాదానికి కారణమైంది. ఈ జలతరంగిణి జలపాతం ఇటీవల భారీ వర్షాలు, వరదలతో నాచు పట్టి ఉండడంతో అక్కడ అడుగుపెడితే చాలు.. కాలికి పట్టు లేకుండా జారిపోవడంతో పాటు ఆకస్మికంగా భారీస్థాయిలో వరద జలాలు జారిపడుతుండడంతో ఆ సమయంలో ఉన్నవారెవరైనా వాగులోకి జారి కొట్టుకుపోవడం ఖాయంగా మారింది. ఈ ప్రాంతాల్లో జలపాతాలు ప్రమాదభరితంగా ఉన్నాయని తెలిసినా ఎవరూ జలపాతాల వైపు రావద్దని అధికారులు నిరోధించడం లేదు. అంతేకాదు ప్రమాదభరితంగా ఉన్నాయన్న సంకేతాలను కూడా అక్కడ ప్రదర్శించలేదు. పాములేరులో కూడా మొసళ్లు ఉన్నాయని ప్రమాద హెచ్చరికలు చేస్తున్నారేతప్ప వాగు ప్రమాదభరితంగా ఉందని మాత్రం ఎవరూ చెప్పడం లేదు. పింజరికొండ విషయంలో అయితే ఎటువంటి హెచ్చరికలూ ఉండవు. సీతపల్లిలో స్థానికులు వారించినా పర్యాటకులు ఆగడం లేదు. ప్రభుత్వం ఇకనైనా ఇక్కడి పర్యాటకంపై దృష్టిసారించాల్సి ఉంది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితోపాటు పర్యాటకుల రక్షణ బాధ్యత కూడా పూర్తిస్థాయిలో చేపడితేనే ఇలాంటి ఘటనలకు ఆస్కారం ఉండదు. మన్యంలో పర్యాటకంలో వాగుల్లో, జలపాతాల్లో స్నానాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టి, కేవలం వీక్షణకే పరిమితం చేయాలని పలువురు కోరుతున్నారు.

మన్యంలోని జలపాతాలు, కొండవాగులు పర్యాటకులను ఎంతగా ఆకట్టుకుంటున్నాయో అంతకుమించి పర్యాటకులను మింగేసే మృత్యుకుహరాలుగా మారాయి. ఈ పర్యాటక కేంద్రాల్లో సరైన భద్రత, రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో పర్యాటకులను తరచూ బలితీసుకుంటున్నాయి. ఆదివారం నాడు మారేడుమిల్లి మండలం అటవీశాఖ నిర్వహిస్తున్న జలతరంగిణి జలపాతంలో ఇద్దరు మెడికోలు మృతి చెందగా, మరొక విద్యార్థి గల్లంతైన ఘటన నేపథ్యంలో మన్యం విహార కేంద్రాల రక్షణ చర్చనీయాంశంగా మారింది.



భవిష్యత్ తరాలకు మంచి వైద్య సేవలు అందించే వైద్యురాలిగా నా బిడ్డను చూడాలనుకున్నాను. కానీ ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. **రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద అమృత తండ్రి బాలి శ్రీనివాసరావు ఆవేదన**



తలకు బలమైన గాయాలు కావడంతో చివరిసారిగా ముఖం చూసేందుకు కూడా అవకాశం లేదు. ఈ దుర్ఘటన గురించి తెలిసిన తర్వాత సౌమ్య తల్లిదండ్రులు అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యారు.
సౌమ్య మేనమామ మచ్చ ఆదినారాయణ



కుమారుడు హరదీప్ ఆచూకీ తెలియకపోవడంతో కొండవాగుల వద్ద ఆందోళనగా తండ్రి రవి ప్రసన్న

మెడికోలను చిదిమేసిన జలఖడ్గం

- కొండ రాళ్ల తాకిడికే మృత్యువాత
- ఒకరి తలకు, నుదిటికి తీవ్ర గాయాలు
- మరొకరి ముఖం ఛిద్రం
- జలతరంగిణి సృష్టించిన విలయం
- ఏడడుగుల ఎత్తులో ప్రవాహం
- ఇప్పటికీ కురుస్తున్న వర్షం
- ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు లభ్యం
- మరొక విద్యార్థి కోసం గాలింపు
- రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు



మారేడుమిల్లి, సెప్టెంబరు 23: ఆనందంలో మునిగితేలుతున్న ఆ క్షణాలు.. వారికి చివరి క్షణాలయ్యాయి. వైద్య విద్యతో ఒకరికి ప్రాణదానం చేయాల్సిన వీరిని మృత్యువు.. క్షణాల్లో విగతజీవులుగా మార్చేసింది. నిజానికి ప్రకృతి సోయగాలకు అసలైన అందం జలపాతాలే. కొండకోనల్లోంచి పొంగిపొర్లుకుంటూ వాగుల్లోకి వచ్చే దృశ్యాలను వీక్షించేవారు కొందరైతే, పచ్చని ప్రకృతి ఒడిలోంచి వడివడిగా వస్తున్న ఆ చల్లని జలాల్లో ఈదులాడాలని ఉరకలెత్తేవారు కొందరు. ఆ తహతహే కొందరిని మృత్యువు తన ఒడిలోకి లాగేసుకుంటోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతానికి ఆదివారం ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు విచ్చేశారు. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతంలో ఐదుగురు కొట్టుకుపోగా వీరిలో గాయత్రి పుష్ప, చింతా హరిణి ప్రియ గాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌కు చెందిన బృందాలు మొత్తం 40 మంది ఆదివారం సాయంత్రం నుంచి మిగిలిన ముగ్గురి కోసం తీవ్ర స్థాయిలో గాలించాయి. రెవెన్యూ, అగ్నిమాపక, అటవీ అధికారుల సమన్వయంతో నిరంతరాయంగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఆదివారం అర్ధరాత్రి విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలోని డొంకినవలస గ్రామానికి చెందిన బాలి అమృత (22) మృతదేహాన్ని కనుగొన్నారు. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో బొబ్బిలికి చెందిన కొసిరెడ్డి సౌమ్య(21) మృతదేహాన్ని కనుగొన్నారు. మరొక విద్యార్థి ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట్ల హరదీప్(20) ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సోమవారం రాత్రి వరకు గాలింపు చర్యలు కొనసాగించాయి. రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, డీఎఫ్‌వో బబిత, మారేడుమిల్లి సీఐ సీహెచ్ మురళీకృష్ణ, తహసీల్దారు కారం సుబ్బారావు గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

ఎంత ఘోరం..

మెడికోలు ఆదివారం మధ్యాహ్నం ఒకటిన్నర-రెండు గంటల మధ్య ఇక్కడ స్నానాలకు దిగారు. అప్పటికే వర్షం మొదలైంది. దీనికితోడు కొండల్లోంచి భారీగా వరదనీరు ముంచెత్తింది. ఒక ఉప్పెన మాదిరిగా విలయతాండవం చేస్తూ ఒక్కసారిగా జలతరంగిణి భయోత్పాతం సృష్టించింది. మొత్తం 14 మంది మెడికోలకుగాను ఐదుగురు చిక్కుకుపోయారు. వీరిలో ఒకరు ఏదోలా బయటపడగా, మరొకరిని సమీపంలో కాజ్‌వే వద్ద రక్షించారు. ఇక మిగిలిన వారిలో అమృత మృతదేహం జలతరంగిణి నుంచి కొట్టుకుపోయి ఒకటవ కాజ్‌వే దాటిన తర్వాత ఇసుక దిబ్బ వద్ద లభ్యమైంది. ప్రవాహ వేగానికి రాళ్లకు కొట్టుకుపోవడంతో నుదుటి మీద, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షణాల్లోనే మృతి చెందినట్టు భావిస్తున్నారు. అలాగే సౌమ్య మృతదేహం కూడా అదే ప్రాంతంలోని తుప్పల్లో చిక్కుకుపోయింది. సౌమ్యకు తీవ్ర గాయాలు కావడంతో పాటు ముఖం ఛిద్రమైంది. రాళ్ల దెబ్బలకు తగిన గాయాలకే ఆమె కూడా మృతి చెంది ఉండొచ్చని తెలుస్తోంది. జలఖడ్గంలా వచ్చిన పడిన ప్రవాహం అరగంటలో వర్షం తగ్గగా, కొద్దిసేపటికే కొంత తగ్గుముఖం పట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ప్రవాహం మొదటి కాజ్‌వే ప్రాంతంలో ఏకంగా ఏడడుగులుపైనే ఉంటుందని చెబుతున్నారు. మళ్లీ సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా వర్షం కురవడంతో జలతరంగిణి వద్ద ఒక్కసారిగా జలప్రవాహం పెరిగిపోయింది. దాంతో గాలింపు చర్యలను సైతం నిలిపివేయాల్సి వచ్చింది. సాయంత్రం వర్షం తగ్గాక మరొక విద్యార్థి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జలతరంగిణి నుంచి పాములేరు వాగు వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. వాగు వంపులు తిరుగుతూ వెళుతుంది. దాంతో ప్రవాహ వేగాన్ని దృష్టిలో పెట్టుకుని గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. రెండో కాజ్‌వే వద్ద తూముల్లో కూడా గాలించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా
జడ్పీ సీఈవోగా లక్ష్మణరావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా వీవీ వీఎస్ లక్ష్మణరావు నియమితులయ్యారు. డ్వామా విజయనగరం జిల్లా గరివిడి క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇంత వరకు ఇన్‌చార్జి సీఈవోగా పనిచేసిన కాకినాడ డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి విశాఖపట్నం జిల్లా జడ్పీ సీఈవోగా బదిలీ అయ్యారు.

జడ్పీలో పారదర్శంగా అంతర్గత బదిలీలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23: జీవో నెం.75 మార్గదర్శకాలను అనుసరించి ఉమ్మడి జిల్లా జడ్పీలో పారదర్శకంగా అంతర్గత బదిలీలు చేపట్టామని జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు పేర్కొన్నారు. అంతర్గత బదిలీ అయిన జడ్పీ ఉద్యోగులకు సోమవారం తన చాంబర్‌లో ఆయన ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈవో పి.నారాయణమూర్తి, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ఎంపీడీవోలు 28 మంది, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 40 మంది, సీనియర్ అసిస్టెంట్లు 61 మంది, జూనియర్ అసిస్టెంట్లు 91 మంది, టైపిస్టులు 41 మంది, రికార్డు అసిస్టెంట్లు 26 మంది, డ్రైవర్లు ఇద్దరు, ఓఎస్‌లు 67మంది, ఎల్‌జీఎస్‌లు నలుగురు.. మొత్తం 360 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

చిరుత పులి కదలికలు లేవు

డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా చిరుతపులి కదలికలను ఏమీ గుర్తించలేదని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివాన్‌చెరువు రక్షిత అటవీ ప్రాంతం, చుట్టుపక్కల ప్రాంతాల్లో 105 ట్రాప్ కెమెరాలు, 10 సీసీ కెమెరాలు, ఏడు ట్రాప్ బోనులను ఏర్పాటు చేశామన్నారు. అటవీ శాఖ బృందాలతో నిత్యం గాలిస్తున్నప్పటికీ ఈ నెల 20 నుంచి చిరుతపులి కదలికలు కెమెరాల్లో కనిపించలేదని స్పష్టం చేశారు. దివాన్‌చెరువు రక్షిత అటవీ ప్రాంతం చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి కూడా చిరుత కదలికలపై ఏ విధమైన సమాచారం రాలేదన్నారు. చిరుతపులి కదలికలను గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తూనే ఉన్నామని డీఎఫ్‌వో చెప్పారు.

4.5 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురు అరెస్టు

మోతుగూడెం, సెప్టెంబరు 23: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సీలేరు వైపు నుంచి డొంకరాయి వస్తున్న మహీంద్ర జైలో కారును ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.23వేలు విలువైన 4.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న కృష్ణా జిల్లాకు చెందిన తలారి మణికంఠ, లంకపల్లి మధుకుమార్, ఏలూరు జిల్లాకు చెందిన వద్దాది మున్నిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కారుతో పాటు రెండు మొబైల్స్ సీజ్ చేశారు.



సత్యదేవుని సన్నిధిలో శాంతి హోమం

శాంతి హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, సెప్టెంబరు 23: తిరుమలలో కల్తీ నెయ్యి వినియోగంపై అపరాధ నివారణ కోసం దేవదాయ శాఖ ఆదేశాలతో సోమవారం అన్నవరం దేవస్థానం పండితులు, అర్చకులు శాంతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వనదుర్గ ఆలయం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, మంటపారాధన జరిపి దేశ సుభిక్షం, లోక కల్యాణార్థం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 11 గంటలకు హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు వైదిక కార్యక్రమాలు నిర్వహించగా పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతి తదితరులు పాల్గొన్నారు.

యువత జీవితంలో క్రీడలు భాగం కావాలి: మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 23: యువత జీవితంలో చదువుతో పాటు క్రీడలు భాగం కావాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో గరిగిపాటి జానకిరామయ్య స్మారక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ బాలురు, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలాలు లేవన్నారు. కొన్నిచోట్ల కమర్షియల్ కాంప్లెక్సుల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. నేటి తరం పిల్లలు ఆటలకు సమయం కేటాయించకపోవడంతో చిన్నతనంలోనే పలు రుగ్మతలకు గురవుతున్నారన్నారు. తొలుత గరిగిపాటి జానకిరామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి బాస్కెట్‌బాల్ ఆడారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 14 బాలురు జట్లు, 8 బాలికల జట్లు పోటీలకు హాజరైనట్టు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి తెలిపారు. వీరిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులతో జిల్లా జట్లు ఎంపిక చేస్తామన్నారు. జిల్లా స్థాయి జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సంపతి సత్యనారాయణ పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 23: మహిళల్లో గర్భాశయ, రొమ్ము తదితర క్యాన్సర్లు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లోని గైనకాలజీ ఓపీడీ, ఎస్ఆర్ఎంటీ విభాగం వద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం దీనిని పీఐఎన్‌సీసీ ప్రెసిడెంట్ జీన్‌టాల్బర్ట్ ఫాకోగ్, లీడ్ ఇండియన్ ఆపరేషన్స్ డాక్టర్ సమత కడియాలతో కలిసి కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్‌ను నివారించే లక్ష్యంతో జీజీహెచ్‌లోని ప్రసూతి, గైనకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ-గ్లోబల్ (పీఐఎన్‌సీసీ) విభాగం సంయుక్తంగా ఈ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్క్రీనింగ్ పరీక్షలకు హాజరయ్యే మహిళలు నెంబరుకు 8885253889 వాట్సప్ లేదా rorm-ckkd@gmail.com మెయిల్ ఐడీకి తమ వివరాలు పంపించి నమోదు చేసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్ హెచ్‌వోడీ డోలోరేసా ఫెర్నాండెజ్, అమెరికల్ కాలేజ్ ప్రసూతి, గైనకాలజిస్టు డాక్టర్ సుసాన్ కోక్రాన్, డాక్టర్ కరోల్ హౌబాచ్, జీజీహెచ్ రేడియేషన్ ఆంకాలజీ, ఓబీజీ విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ పి.శ్రీనివాసన్, డాక్టర్ అనురాగమయి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రుక్మిణి పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

పులిపిరి(సురిడికాయ)కి అరుదైన చికిత్స

- ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కాకినాడ జిల్లా, సెప్టెంబర్ 23: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కాకినాడ మెయిన్ రోడ్, చందనాబ్రదర్స్ ఎదురుగా, జయరాం హీరో షోరూమ్ ప్రక్కన, హోటల్ శ్రీవాత్స, కాకినాడ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 23, 24, 25,తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. మంగళ, బుధవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

నేడు పశ్చిమ మండల ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం పశ్చిమ మండల ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో 290 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయన్నారు. వీటి నుంచి హాజరయ్యే వారు ఎంపికల్లో సత్తా చాటాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారుల పర్యవేక్షణలో వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని ఎన్ఎస్ఎస్ విభాగాలు తమ తమ యూనిట్లలో ప్రతిభావంతులైన వలంటీర్లను ఎంపిక చేసి సెలక్షన్స్‌కు తీసుకు రావాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు, వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు సంయుక్తంగా ఎంపిక ప్రక్రియ పూర్తిచేయాలని శ్రీనివాసరావు కోరారు.

రేపు 'నన్నయ'లో ప్రాంగణ ఎంపికలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రాంగణ ఎంపికలు జరుగుతాయని ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. 2023-24లో ఎమ్మెస్సీ ఆర్గానిక్, అనలిటికల్ కెమిస్ట్రీ, బీఎస్సీ మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీలో 60శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యా సంవత్సరంలో ఎటువంటి గ్యాప్‌లేని మహిళా అభ్యర్థులకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. అనలిటికల్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగంలో ఉద్యోగాలకు నిర్వహిస్తున్న ఈ ప్రాంగణ ఎంపికలను విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఎంపికైన వారికి అప్రెంటీస్ ట్రైనీ హోదాతో పాటు నెలకు రూ17,500 నుంచి 21,500 వరకు స్టైఫండ్ ఇస్తారు. 25వ తేదీ ఉదయం 10 గంటలకు నన్నయ వర్సిటీ సెమినార్ హాల్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అశ్విని ఎంపిక

అనపర్తి, సెప్టెంబరు 23: స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఇటీవల కాకినాడలో జరిగిన యోగా అండర్-19 పోటీల్లో అనపర్తి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అశ్విని విశేష ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ రాజేశ్వరి తెలిపారు. విద్యార్థినిని సోమవారం పీఈటీతో పాటు హెచ్ఎం కళ్యాణి, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.



మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ

భార్య మృతి, భర్తకు గాయాలు... ఎర్రకోనేరు వద్ద ఘటన

బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్లొస్తుండగా ప్రమాదం

తుని రూరల్, సెప్టెంబరు 23: కాకినాడ జిల్లా తుని రూరల్ పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారి ఎర్రకోనేరు సెంటర్లో సోమవారం జరిగిన ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన పల్లి ఆదిలక్ష్మి (48) భర్త వెంకట్రావుతో కలిసి ఎస్.అన్నవరం గ్రామంలో బంధువులు ఇంటికి పరామర్శకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో వారి మోటారు సైకిల్‌ను ఎర్రకోనేరు వద్ద లారీ ఢీకొట్టింది. లారీ చక్రంలో ఇరుక్కున్న ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ఎగిరి రోడ్డు పక్కన పడ్డ భర్తని 108 అంబులెన్సులో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్ఐ కృష్ణమాచారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ తప్పించుకుపోయే ప్రయత్నం చేయగా పోలీసులు చాకచక్యంగా వెంబడించి పట్టుకున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.



ఆదిలక్ష్మి (పాత చిత్రం)



ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులు

టీటీ పోటీల్లో 'శ్రీప్రకాష్' విద్యార్థులకు పతకాలు

పెద్దాపురం, సెప్టెంబరు 23: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో మూడు రోజులు జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 టేబుల్ టెన్నిస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. అక్టోబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. విజేతలను కోచ్‌లు వేణు, శ్రీరామ్, పాఠశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఆకడమిక్ కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్-14 బాలికల విభాగంలో నయన కొల్లి (కెప్టెన్), గీతాంజలి భైరవి, బాలుర విభాగంలో టి.సాయిశర్వణ్ (కెప్టెన్), ఎ.సృజన్, వేద్ తివారి, అభిక్ భట్టాచార్య, అండర్-17 బాలుర విభాగంలో డి.ప్రహర్ష (కెప్టెన్), వెంకయ్యనాయుడు, గీతేష్, ఆయుష్మాన్ కాంస్య పతకాలు సాధించారు.

అండర్-17 బాలికల విభాగంలో ఎ.శాంతిజ్యోతి (కెప్టెన్), మౌపర్ణదాస్, సీహెచ్ సాయిశృతి, డి.నిషితసాయి, అండర్-19 బాలికల విభాగంలో టి.సాయిసుదీక్ష (కెప్టెన్), ఎం.దర్శిక, ధరణి శ్రీకార్తికేయ, జాన్ రెజినా, బాలుర విభాగంలో పి.అశ్విన్, సీహెచ్ విజయ్‌ధర్, టీఎస్ఎస్ విఖ్యాత్, ఎం.వెంకటధనుష్ స్వర్ణ పతకాలు సాధించారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర

మౌలిక వసతులు కల్పించండి

నీతి అయోగ్ సమావేశంలో వై.రామవరం ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, సెప్టెంబరు 23: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై.రామవరం మండలం పూర్తిగా వెనుకబడి ఉందని, రహదారులు వేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని వై.రామవరం ఎంపీడీవో బాపన్నదొర విజ్ఞప్తి చేశారు. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి వై.రామవరం మండలాన్ని నీతి ఆయోగ్ బృందం గుర్తించింది. వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ తమ మండలంలో అనేక లోతట్టు గ్రామాలున్నాయన్నారు. 50 గ్రామాలకు మాత్రమే రహదారులున్నాయని, 90 గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేవన్నారు. ఆయా గ్రామాల్లో ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న రోగులకు నేటికీ డోలీమోతలు తప్పడం లేదని, వాటి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో విద్యా వసతులు, టెలికమ్యూనికేషన్, వ్యవసాయాభివృద్ధి, కరెంటు సౌకర్యాలను ఎంపీడీవో ప్రతిపాదించారు. మండలాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని విన్నవించారు. సంపూర్ణత పోషణ అభియాన్‌పై గ్రామసభలు పెట్టి గిరిజనుల్లో చైతన్యం కల్పిస్తున్నామని బాపన్నదొర వివరించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కూటమి నాయకులు

జాతీయ టీ10 క్రికెట్ పోటీలకు ఎంపిక

బిక్కవోలు, సెప్టెంబరు 23: జాతీయ స్థాయి టీ10 క్రికెట్ పోటీలకు తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్టు హెచ్ఎం కేవీ రాఘవులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీ10 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఇందులో ఆరుగురు విద్యార్థులు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. పదో తరగతి చదువుతున్న ఎస్కే సమీర్, జి.ఈనోష్, పి.శివసాయి, డి.దుర్గాప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి టీ10 పోటీలకు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 21వ తేదీ నుంచి మహారాష్ట్రంలోని నాసిక్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. విజేతలను, వారిని తీర్చిదిద్దిన పీడీ ఎండీ జావిద్‌కరిముద్దీన్‌ను కూటమి నేత నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి, ఎస్ఎంసీ ఛైర్మన్ బర్ల శ్రీనివాస్ అభినందించారు.

- కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- పలు మండలాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు
- కరపత్రాలు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

వేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం

ఆలమూరు, సెప్టెంబరు 23: కల్తీ నెయ్యి సేకరించిన అంశంలో భక్తుల మనోవేదనకు కారణమైన ప్రతీ ఒక్కరిని కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి శిక్షిస్తారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద తిరుమల వేంకటేశ్వరస్వామి చిత్రపటానికి సోమవారం ఆయన క్షీరాభిషేకం చేశారు. వైసీపీ పాలనలో టీటీడీ పాలక మండలి చేసి న అపచారం క్షమించరానిదన్నారు. కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి: మంత్రి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 23: సమాజంలో అందరికి సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం పారిశుధ్య కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు సఫాయి సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. పారిశుధ్యం నిత్యం మెరుగుపరుస్తూ అందరికి ఆరోగ్యం ప్రసాదిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అందరిపై బాధ్యత ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ప్రవీణ్, ఇన్‌చార్జి ఎంపీడీవో సెలట్ రాజు, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకర నారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట: ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 23: రాష్ట్రంలో ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట ప్రభుత్వాసుపత్రిలో సోమవారం మండపేట నియోజకవర్గంలోని పారిశుధ్య సిబ్బంది కోసం ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధాకుమారి ఆధ్వర్యంలో 600మంది పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, చైర్‌పర్సన్ రాణి, బీజేపీ జనసేననేతలతో కలిసి వేగుళ్ల ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు రాజీవ్, సారధి, ప్రశాంతి, సుప్రియ వైద్య సేవలందించారు. కూటమి నాయకులు ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు, పాలచర్ల శిరీషా, కోనా సత్య నారాయణ, శెట్టి రవి, నామాల చంద్రరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం

కొత్తపేట, సెప్టెంబరు 23: సఫాయి కార్మికులతో పాటు అన్ని విభాగాల కార్మికుల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం జరిగిన సురక్ష మెడికల్ క్యాంపును జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్, సర్పంచ్ బూసి జయలక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, అద్దంకి చంటిబాబు, ముద్రగడ సుబ్బారావు, కంఠంశెట్టి చంటి, పల్లికొండ

పారిశుధ్య కార్మికుల కోసం వైద్య శిబిరాలు

సుధీర్‌కుమార్, బూసి వెంకటరమణ, పాలూరి జయప్రకాష్ నారాయణ్, కముజు శ్రీను, చోడపనీడి ఉమా పాల్గొన్నారు.

ప్రొటోకాల్ వివాదం: కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహించిన సురక్ష మెడికల్ క్యాంపులో ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఫొటోలేకుండా ఫ్లెక్సీ వేయడంపై కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దీనిపై బీజేపీ యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ వైద్యాధికారులను నిలదీశారు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆరోగ్య శాఖ మంత్రి ఫొటోతో ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

రాజోలు: రాజోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకు ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవు జ్యోతి, ఉప సర్పంచ్ పామర్తి రమణ, చాగంటి స్వామి, కుంపట్ల చిన్నారి, గుండుబోగుల పెదకాపు, కడలి వెంకటరమణారావు, ఎంపీడీవో ఎస్.బాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా మందులు పంపిణీ

ముమ్మిడివరం, సెప్టెంబరు 23: ముమ్మిడివరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సురక్షా వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.మల్లేశ్వరి ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ వైద్యులు, ముమ్మిడివరం పీహెచ్‌సీ వైద్యులు, కాకినాడ ఏరియా ఆసుపత్రి వైద్యులు ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలకు చెందిన 200మంది పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు భోజనవసతి కల్పించారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 23: పంచాయతీ సిబ్బంది సంపూర్ణ ఆరోగ్యంతోఉండాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫాయి సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే గిడ్డి సత్య నారాయణ అన్నారు. పి.గన్నవరం సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో ఎం.భారతీ, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కోటేశ్వరరావు పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరిగాయి. సర్పంచ్ బొండాడ నాగమణి, అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు, డాక్టర్ అప్పారి సూర్య నారాయణ, డాక్టర్ రాబిన్, డాక్టర్ సంధ్యరాణి, డాక్టర్ మాధురి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, అప్పారావు, శరభరాజు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎండాకు తెగులుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


అంబాజీపేట: ఇసుకపూడిలోని వరి పొలంలో ఎండాకు తెగులును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త నందకిషోర్

ముమ్మిడివరం, సెప్టెంబరు 23: వరిపైరుపై ఆశించిన ఎండాకు తెగులును నివారించేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ సూచించారు. ఎండాకు తెగులు ఆశించిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఎంటీయూ 1318వరి రకంలో ఈఎండాకు తెగులు ఎక్కువగా ఆశించినట్టు ఆయన గుర్తించారు. సెప్టెంబరు మొదటివారంలో కురిసిన తుపాను, వర్షాలు, ఆ తర్వాత అధిక ఎండలు కాయడం, రైతులు అధికంగా నత్రజని వాడడం వల్ల ఈతెగులు ఉధృతి ఎక్కువగా పెరిగిందన్నారు. అంకురం ఏర్పడే దశలో ఎకరానికి 15నుంచి 20కిలోల పొటాష్ ఎరువును తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు నివారణకు ఎకరానికి ప్లాంటోమైసిన్ వంద గ్రాములు, కాపర్ ఆక్సిక్లోరైడ్ 450 గ్రాముల వంతున పిచికారీ చేసుకోవాలన్నారు. తెగులు ఉధృతిని బట్టి ఏడు నుంచి పది రోజుల వ్యవధిలో రెండోసారి పిచికారీ చేసుకోవాలని, దీనిలో ఏవిధమైన పురుగు మందులు గానీ, తెగుళ్ల మందులు గానీ కలపరాదని శాస్త్రవేత్త నందకిశోర్ తెలిపారు. ఆయన వెంట వ్యవసాయాధికారులు ఉన్నారు.

ఎండాకు తెగులుతో అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, సెప్టెంబరు23: వరిలో ఆశించే ఎండాకు తెగులుతో రైతులు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా(ఏరువాక) కేంద్రప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ అన్నారు. చిరతపూడి, ఇసుకపూడి గ్రామాల్లో వరి పొలాలను సోమవారం పరిశీలించారు. ఎండాకు తెగులు అరికట్టడానికి ఎకరానికి ప్లాంటోమైసిన్ 100గ్రాములు, కాపర్ ఆక్సిక్లోరైడ్ 450 గ్రాములు చొప్పున పిచికారి చేయాలన్నారు. అమలాపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఏవీఎస్ రాజశేఖర్, ఏవోలు సీహెచ్‌డీ విజయకుమార్, జె.మనోహర్, ఏఈవో డి.దుర్గారావు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం




కె.గంగవరం: మాట్లాడుతున్న కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆలమూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మండపేట: బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కె.గంగవరం, సెప్టెంబరు23: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనతో ప్రజల్లో నమ్మకం సంపాదించిందని, విజయవాడ వరద బాధితుల కోసం వివిధ సంస్థలు, ప్రజలు, వ్యాపారవేత్తలు రూ.400కోట్లు ప్రభుత్వానికి అందించడమే నిదర్శనమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం పామర్రులో జరిగిన సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, పట్టణాన్ని స్వర్ణ రామచంద్రపురంగా తీర్చిదిద్దుతామన్నారు. మరోముఖ్య అతిథి ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ వంద రోజుల్లో అమరావతికి రూ.15 వేలకోట్లు, పోలవరానికి రూ.12వేలకోట్లు సాధించామన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు కాదా వెంకటరమణ మాట్లాడుతూ కోటిపల్లి-ముక్తేశ్వరం వంతెన నిర్మాణం చేయాలని కోరారు. జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావులు కూటమి విజయాలు వివరించారు. సభలో పామర్రుకు చెం దినకరుటూరి వెంకట్రావు వరద బాధితుల కోసం రూ.10వేలు చెక్కునుమంత్రి, ఎంపీలకు అందజేశారు. కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చుండ్రువీవీఎస్ఎస్ చౌదరి, సర్పంచ్ వాసంశెట్టి వెంకటదుర్గ సూరిబాబు, ఎంపీటీసీ కడలి సత్య సూర్యకుమారి, కూటమి నాయకులు మరివాడ చిన్నికృష్ణ, మరివాడ సూరిబాబు, చిర్రా రాజ్‌కుమార్, అవసరాల రమణమూర్తి, మేడిశెట్టి రవికుమార్, కొత్తపల్లి మొరార్జీ, సలాది రమేష్, తోట వెంకన్న, డ్వామా పీడీ మధు సూదనరావు, గజలక్ష్మి, తహసీల్దార్ కె.సూర్యారావు పాల్గొన్నారు.

నిజంగా ఇది మంచి ప్రభుత్వమే

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 23: మునిపల్లిలో సోమవారం ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు పాలనపై అభిప్రాయ సేకరణ చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల సూర్యప్రకాశరావు, నిమ్మకాయల ఆంజనేయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్న మంచి ప్రభుత్వం

మామిడికుదురు, సెప్టెంబరు 23: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆదుర్రులో సోమవారం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన నామన రాంబాబు, మండలాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, సర్పంచ్ బి.శ్రీనివాస్, బోనం బాబు పాల్గొన్నారు.

పొట్టిలంకలో ఇది మంచి ప్రభుత్వం

అయినవిల్లి, సెప్టెంబరు 23: పొట్టిలంకలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలపై ప్రచురించిన కరపత్రాలను సచివాలయ సిబ్బంది, పంచాయతీ విస్తరణాధికారి వాణిశ్రీబెహరా, కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన సునీతసుబ్బలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం

మలికిపురం, సెప్టెంబరు 23: రాష్ట్రంలో ప్రజల అభీష్టం మేరకు పాలన సాగుతోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం విశ్వేశ్వరాయపురంలో సర్పంచ్ చెల్లుబోయిన హెలీన అధ్యక్షతన జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, బందెల పద్మ, ఎంపీడీవో మంగాదేవి, టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, గుండుబోగుల పెదకాపు, అడబాల యుగంధర్, గుండాబత్తుల తాతాజీ, చాగంటి స్వామి, చెల్లుబోయిన హరికృష్ణ, తహసీల్దార్ సీఎస్ రాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

మండపేట, సెప్టెంబరు23: రాష్ట్రంలో వందరోజుల కూటమి ప్రభుత్వ పాలన ప్రజారంజకంగా సాగిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, నారా లోకేష్ సారధ్యంలో రాష్ట్రం పురోభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు సిద్ధంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో గొల్లపుంత నిర్మించిన టిడ్కో గృహాలను ఈఏడాది డిసెంబరు నాటికి లబ్ధిదారులకు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించిఅందిస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి మున్సిపల్ కమిషనర్ రంగరావు వివరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీరప్రకాష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. అర్తమూరులో సోమవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు గురించి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి వివరించారు.

గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కర్రి జంబయ్యరెడ్డి, తాడి శేషారెడ్డి, పడాల రామకృష్ణారెడ్డి, తేతలి వెంకటరెడ్డి, చిర్ల చంద్రారెడ్డి, చిర్ల ఆదిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, విద్యార్థులు, స్థానికులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గాడిలో పడిన పాలన

ఆలమూరు, సెప్టెంబరు 23: రాష్ట్రంలో అస్తవ్యస్త పాలనను వంద రోజుల్లో గాడిపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుదేనని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరులో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించకుండా ఇబ్బందుల పాలుచేసిందని అయితే కూటమి ప్రభుత్వం రైతుల బకాయిలను చెల్లించి రైతులకు అండగా నిలిచి రైతు ప్రభుత్వంగా గుర్తింపు పొందినట్లు వివరించారు. అనంతరం స్వచ్ఛత హీ సేవలో పాల్గొని పారిశుధ్య కార్మికులతో కలిసి పనిచేశారు. మహిళలకు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి వారిని నూతన వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఎంపీడీవో జాన్‌లింకన్, ఆలమూరు మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

అల్లవరం, సెప్టెంబరు 23: టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో సర్పంచ్ బొమ్ము బాలవేణి అధ్యక్షతన అల్లవరం సచివాలయం-2 పరిధిలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఎంపీటీసీ ఎన్.మౌనిక వరలక్ష్మి, కంకిపాటి వీరబాబు, సుంకర సాయి, మామిడిశెట్టి రాజు, వెదుళ్లపల్లి సుబ్రహ్మణ్యం, కరారి సుబ్బారావు పాల్గొన్నారు.

గాడిలంకలో పథకాలపై అవగాహన

ముమ్మిడివరం, సెప్టెంబరు23: గాడిలంకలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులతో కూటమి నాయకుడు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై అవగాహన కల్పించి బ్రోచర్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు గుత్తుల సాయి, సర్పంచ్ పెద్దిరెడ్డి నాగమునీంద్రరావు, మహాదశ లక్ష్మీనారాయణ, పెద్దిరెడ్డి సత్యనారాయణమూర్తి, మామిడిశెట్టి శివ, పంచాయతీ కార్యదర్శి ఎం.ధనశేఖర్, ప్రత్యేకాధికారి ఎం.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దేవ, కూటమి శ్రేణుల దీక్ష

అంతర్వేది, సెప్టెంబరు 23: వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీకి గురైనట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ లడ్డు ప్రసాదంలో నెయ్యి కల్తీపై బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, గుబ్బల ఫణికుమార్, ఎంపీటీసీ బైరా నాగరాజు, పోతురాజు కృష్ణ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు, గొల్లమందల నిరంజన్, వాస్కూరి వెంకటేశ్వరరావు, మందపాటి వెంకటేశ్వరరావు, దాసరి వాసు, పొన్నాల ప్రభ, వనమాలి మూలస్వామి, తాడి మోహన్‌కుమార్, శంకరగుప్తం కొండబాబు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

హరికథా, వేద పాఠశాలల వార్షికోత్సవం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు23: కపిలేశ్వరపురంలో శ్రీసర్వారాయ హరికథా, వేదపాఠశాలల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలల 52వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక హరికథా పాఠశాలలో వేదపాఠశాల ప్రిన్సిపాల్ తంగిరాల దత్తాత్రేయశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉభయ పాఠశాలల వ్యవస్థాపకుడు, మాజీ కేంద్రమంత్రి దివంగత ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు (చంటిదొర) జయంతి వేడుకలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు చంటిదొర చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వక్తలు గొర్తి రామచంద్రరావు, కమ్మ వీరవెంకట్రావు, ఎన్ఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ ఉభయ పాఠశాలల అభివృద్ధికి చంటిదొర చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు మిరియాల సిరివల్లి శ్రీరామ జననం హరికథన రూపంలో, ఎస్.శిల్ప శ్రీనివాస కల్యాణం హరికథ రూపంలో గానం చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి వేదపఠనం, హరికథా గానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మేకా కృష్ణ, ఉభయ పాఠశాలల విద్యార్థులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ అధికారులతో ఎమ్మెల్యే భేటీ

యానాం, సెప్టెంబరు23: యానాంలో మత్స్యకారులకు రావాల్సిన పరిహారానికిసంబంధించి కాకినాడలోని ఓఎన్జీసీ అధికారులతో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సమావేశమయ్యారు. మత్స్యకారులకు రావాల్సిన పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరారు. దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ ఐలాండ్ నెంబర్-5లో 198మంది రైతులు జీవనోపాధి సాగిస్తున్నారు. వరదలకు ఐలాండ్ చుట్టూ రక్షణ లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వరద నీరు లోనికి ప్రవేశించకుండా రక్షణ గట్టు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

విద్యార్థుల ఆర్థిక సాయం

రావులపాలెం, సెప్టెంబరు 23: విజయవాడ వరద బాధితులకు విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. ఊబలంక జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రూ.20,850 నగదును సమకూర్చి సీఎం సహాయనిధికి ఎస్ఎంసీ చైర్మన్ మేడపాటి సురేశ్వరరెడ్డి ద్వారా అందజేశారు.

నాలుగు రోజులు తాగునీటి సరఫరా ఉండదు

కాట్రేనికోన, సెప్టెంబరు 23: పల్లంకుర్రు పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు నాలుగు రోజులు తాగునీటి సరఫరా ఉండదని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగు అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. కందికుప్ప ప్రాజెక్టు నుంచి పల్లంకుర్రుకు ఏర్పాటుచేసిన పైప్‌లైన్ మరమ్మతులకు గురైందన్నారు. ఈ పైప్‌లైన్‌పై అక్రమ నిర్మాణాలు ఉన్నందున వాటిని తొలగిస్తేనే బాగుచెయ్యడం వీలుపడదన్నారు. అక్రమ కట్టడాలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వారు నిర్ణయం తీసుకునే వరకు తాగునీటి సరఫరా ఉండదన్నారు.

చర్చి ఫాదర్ మరియాదాసుకు డాక్టరేట్

యానాం, సెప్టెంబరు 23: యానాం రోమన్ కేథలిక్ చర్చి ఫాదర్ పి.మరియాదాసుకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తినష్టం నివారణకు తీసుకోవలసిన అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.ప్రేమానందం పరిశోధనకు గైడ్‌గా వ్యవహరించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగం అధిపతి ఎ.నరసింహారావు నుంచి డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం

రావులపాలెం, సెప్టెంబరు23: రావులపాలెంలో స్వచ్ఛతహీసేవా కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి పారిశుధ్య కార్మికులతో కలిసి పనులు చేశారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కోట వెంకటేశ్వరరావు, చిన్న కేవీ పాల్గొన్నారు.

ఎంఈవోగా అప్పాజీ బాధ్యతల స్వీకరణ

ఆలమూరు, సెప్టెంబరు23: ఆలమూరు ఎంఈవో-1గా ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అప్పాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అప్పాజీని ఎంపీడీవో జాన్‌లింకన్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యాలయం సిబ్బంది అభినందించారు.

అంతరిక్ష ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

రాయవరం, సెప్టెంబరు23: రాయవరం శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం అంతరిక్ష ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో వై.సూర్యనారాయణ అధ్యక్షతనజరిగిన కార్యక్రమంలో విక్రమ్‌సారాభాయ్ స్పేస్‌సెంటర్ విశ్రాంతశాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ ముఖ్య అతిథిగామాట్లాడారు. హెచ్ఎం.వి.శాంతిసునీత పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	: ఉత్సాహం
శేఖర్ స్క్రీన్-1	: కళింగ
శేఖర్ స్క్రీన్-2	: ఆయ్
రమా	: మత్తువదలరా-2
గణపతి	: కమిటీ కుర్రోళ్లు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గొర్రె పురాణం

ఆలయాల పవిత్రత కాపాడటమే కూటమి లక్ష్యం



ఆత్రేయపురం, సెప్టెంబరు23: భక్తుల మనోభావాలను దెబ్బతినకుండా ఆలయాల పవిత్రతను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని లడ్డూ ప్రసాదపోటులో వేదపండితులు సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. లడ్డూలో ఉపయోగిస్తున్న నెయ్యి పరిశీలించారు. సర్పంచ్ కాయల జగన్నాథం, కంఠంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన లడ్డూను భక్తులకు అందించాలి

మామిడికుదురు, సెప్టెంబరు 23: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానానికి వచ్చే భక్తులకు నాణ్యతతో కూడిన లడ్డూలను అందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. సోమవారం ఎమ్మెల్యే దేవస్థానంలో లడ్డూ తయారీ కేంద్రాన్ని పరిశీలించి లడ్డూకు ఉపయోగిస్తున్న నెయ్యి నాణ్యతను పరిశీలించారు. నాణ్యమైన నెయ్యిని లడ్డూ తయారీలో ఉపయోగించాలన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, నాయకులు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లడ్డూల అపవిత్రంపై ద్రాక్షారామలో ప్రదర్శన

ద్రాక్షారామ, సెప్టెంబరు 23: లడ్డూల అపవిత్రంపై సోమవారం ద్రాక్షారామలో భీమేశ్వరాలయం అర్చకులు, పురోహితులు, విశ్వహిందూపరిషత్, జనసేన కార్యకర్తలు నిరసన ప్రదర్శన జరిపారు. బోసుబొమ్మ సెంటర్‌లో నినాదాలు చేశారు. వెంకటేశ్వరస్వామికి ఆలయంలో అర్చకులకు లడ్డూల వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని వినతిపత్రం అందజేశారు. జనసేన నాయకులు ముప్పనపల్లి గణేష్, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

అల్లవరం: తిరుమలలో లడ్డూ అపవిత్రతకు సంబంధించి గోపాయిలంక వినాయకుడి గుడి, అల్లవరం గరువు దుర్గమ్మ గుడి వద్ద ప్రాయశ్చిత పూజలు, దీపాలు వెలిగించి నిరసన తెలిపారు. వీహెచ్‌పీ మండల ధర్మ రక్షక్ గుడాల పుల్లయ్యశెట్టి, చిట్నీడి శ్రీనివాస్, కట్టా నారాయణమూర్తి, మాకిరెడ్డి సత్తిబాబు, చొల్లంగి సత్యనారాయణ, దాసరి చంటి పాల్గొన్నారు.

ఆత్రేయపురం: తిరుపతి పవిత్రతను కాపాడాలని హిందువులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్ వద్ద బీజేపీ నాయకుడు చేకూరి రమేష్‌వర్మ ఆధ్వర్యంలో నిరసనచేపట్టారు. లడ్డూ వ్యవహారంలో ప్రభుత్వం విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

సామాజిక సేవకు ముందుకు రావాలి

మామిడికుదురు, సెప్టెంబరు 23: సామాజిక కార్యక్రమాలు నిర్వహించడంలో ఓఎన్జీసీ ముందుకు రావాలని అమలాపురం ఎంపీ జి.హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పాశర్లపూడిలంక హైస్కూలులో ఓఎన్జీసీ సమకూర్చిన సీఎస్ఆర్ నిధులతో 199సైకిళ్లు, నాలుగు బీరువాలను సోమవారం విద్యార్థులకు అందించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఓఎన్జీసీ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్న గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, టీడీపీ, జనసేన, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, మెండా ఆదినారాయణ, నాయకులు, ఓఎన్జీసీ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభ

అల్లవరం, సెప్టెంబరు 23: సర్పంచ్‌లు తిక్కిరెడ్డి నాగవెంకట శ్రీనివాస్, బొమ్మ బాలవేణి అధ్యక్షతన యెంట్రుకోన, అల్లవరం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభలు జరిగాయి. ఉపాధి పనులపై తనిఖీలు జరిగాయి. కంకిపాటి వీరబాబు, కార్యదర్శి ఎస్.రాజామోహన్‌పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

మండపేట, సెప్టెంబరు 23: తాళ్లరేవు మండలం నీలపల్లికి చెందిన పత్తి సత్యనారాయణ, యానానికి చెందిన గుర్రం భైరవమూర్తి సోమవారం యానాం నుంచి మద్యాన్ని తరలిస్తుండగా మండపేటలో వీరిని ఎస్ఐ హరికోటి శాస్త్రి అరెస్టు చేశారు.

ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ముమ్మిడివరం, సెప్టెంబరు 23: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని అవమానపరిచిన తీరు దుర్మార్గ చర్య అని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని మాలమహానాడు నాయకులు డిమాండు చేశారు. ముమ్మిడివరంలో పోలమ్మ చెరువుగట్టు నుంచి పోలీసుస్టేషన్ వరకు వారు నిరసన ర్యాలీ నిర్వహించారు. పోలీసుస్టేషన్ ఎదుట రహదారిపై బైఠాయించి రఘురామకృష్ణరాజు, పంతం నానాజీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దేవరపల్లి ఏడుకొండలు, మెండి కృష్ణబాబు, కాశి బాలమునికుమారి, కాశి రామకృష్ణ, పెయ్యల బాలరాజు, నీలంక చినబాబు, మోకా రామారావు, డానియల్, కాశి రామచంద్రరావు, నక్కా సూర్యప్రకాష్, సహదేవుడు, చెల్లి మధు, కాట్రు అప్పారావు, బుడితి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: రాఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ అభిమాన సంఘం నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రపటం కాగితాలను దహనం చేశారు. కోట రామ్మోహనరావు, నక్కా వెంకటేశ్వరరావు, గన్నవరపు శ్రీనివాస్, కొక్కిరి రవికుమార్, పుచ్చకాయల సత్యనారాయణ, వడలి కొండయ్య, కొంబత్తుల ఏసు, యన్నాబత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మలికిపురంలో మండల మాల న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన చేపట్టారు. పూలే అంబేడ్కర్ భవనం నుంచి మలికిపురం సెంటర్ వరకు ఊరేగింపుగా వచ్చారు. సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. తోటే రాజేష్, చింతా రాజబాబు, గెడ్డం తులసీభాస్కర్, జి.ఫిలిప్‌రాజు, నల్లి శివ, తాడి సహదేవు, తోటే ప్రతాప్, కారుపల్లి విజయమోహన్ పాల్గొన్నారు.

మామిడికుదురు: రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలని డిమాండు చేస్తూ మామిడికుదురులో సోమవారం మాలమహానాడు నాయకులు నిరసన చేపట్టారు. జాతీయ రహదారిపై ఉండి ఎమ్మెల్యే చిత్రపటాలను దహనం చేశారు. వినతిపత్రాలను తహసీల్దార్ కార్యాలయం, నగరం పోలీసుస్టేషన్లలో అందించారు. మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జడ్పీటీసీ మట్టా శైలజ, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజు, నాయకులు నల్లి శ్రీను, కలిగితి పల్లంరాజు, మట్టా సత్తిబాబు, నెల్లి దుర్గాప్రసాద్, పిల్లి శ్రీను, మెడబల రాజ్‌కుమార్, కుసుమ పెరుమాళ్ల ఉమార్ పాల్గొన్నారు.

అంబాజీపేట: ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. పుల్లేటికుర్రు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద వారునిరసన చేపట్టారు. ఇసుకపూడి దాసరివారిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్రీఅభ్యుదయ యువజన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు పులపర్తి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు నిరసన చేపట్టారు. నూకపెయ్యి చిన్న, జల్లి సుబ్బారావు, మర్రి ఏడుకొండలు, కత్తుల సత్యనారాయణ, కోట విజయరాజు, బీర రవికుమార్, కత్తుల వసంతరావుపాల్గొన్నారు.

రాజోలు: ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై రాజోలు సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం సీఐ టీవీ నరేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు మాలల న్యాయ పోరాట సమితి జేఏసీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. జేఏసీ మండలాధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ మాట్లాడారు. బత్తుల మురళీకృష్ణ, విప్పర్తి సాయిబాబు, బత్తుల జనార్ధనరావు, లిఖితపూడి బుజ్జి, చింతా మధుకుమార్, జిల్లెల్ల వినోద్, కాకర విశ్వనాథం పాల్గొన్నారు.

అల్లవరం: అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి అవమానపరిచిన రఘురామకృష్ణరాజును, కాకినాడ మెడికల్ ప్రొఫెసర్‌పై దాడిచేసిన ఎమ్మెల్యే పంతం నానాజీలను అరెస్టు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్ చేసింది. గోడిలంక అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కుంచే చంద్రరావు, కరారి చంద్రరావు, ఎస్.బాలకృష్ణమూర్తి, వడ్డి సుబ్బారావు, కొనుకు శ్రీనుపాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

రాజోలు, సెప్టెంబరు 23: వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా శ్రీనుకు వలంటీర్లు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. అనంతరం ఎంపీడీవో ఎస్.బాలాజీకి వలంటీర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పంటబోదెలో పడి యువకుడి మృతి

ఆలమూరు, సెప్టెంబరు 23: మూలస్థాన అగ్రహారంలో సోమవారం పంట బోదెలో పడి యువకుడు మృతి చెందినట్లు ఆలమూరు పోలీసులు తెలిపారు. మూలస్థానానికి చెందిన కూడిపూడి రుద్రయ్య(30) కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతనికి ఫిట్స్ వస్తుంటుంది. పొలం పనుల నిమిత్తం సోమవారం మధ్యాహ్నం వెళ్లి పంటబోదెలో పడిపోవడంతో మృతి చెందాడు. అక్కడ ఉన్న వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి.. ఐదుగురి అరెస్టు

ముమ్మిడివరం, సెప్టెంబరు 23: ముమ్మిడివరం నగర పంచాయతీ మట్టాడి వారిపాలెంలో పేకాట శిబిరంపై సోమవారం ఇన్‌చార్జి ఎస్ఐ జె.భానుప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరు పరిచినట్టు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.19,340 నగదు, నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఓఎన్జీసీ నిధులతో పంచాయతీకి ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్

అల్లవరం, సెప్టెంబరు 23: ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో బోడసకుర్రు గ్రామ పంచాయతీకి ఇచ్చిన ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్‌ను ఓఎన్‌జీసీ ఈడీ, అసెట్ మేనేజర్ శాంతన్‌దాస్ సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో విజయదుర్గ ఆలయంలో పూజలు చేసి ట్రాక్టర్ ట్యాంకర్‌ను అందజేసి నీటి సరఫరా ప్రారంభించారు. కార్యక్రమంలో అసెట్ సపోర్టింగ్ మేనేజర్ జి.శ్రీనివాస్, హెచ్ఆర్ ఎస్.రామారావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గాశ్రీనివాస్, ఐల నాగేశ్వరరావు, రేళ్ల శ్రీనివాస్, ఎ.గోపాలం, పి.పోచమ్మ, చింతం శ్రీను పాల్గొన్నారు.